క్లుప్తంగా

ఘనంగా శానిటేషన్ సిబ్బందికి సన్మానం



చల్లపల్లి: స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి స్వచ్ఛ ఆసుపత్రిగా జిల్లా స్థాయిలో అవార్డు వచ్చేందుకు కృషి చేసిన ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందిని ఆసుపత్రి డైరెక్టర్ వరదా హరిగోపాలు, వైద్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అందరూ సమిష్టిగా కృషిచేయటం వల్లే ఆసుపత్రికి అవార్డు వచ్చిందని హరిగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, పీఏసీఎస్ ఛైర్మన్ బొందలపాటి వీరబాబు, అడపా రవి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయురాలికి సత్కారం



కృత్తివెన్ను: తొమ్మిదేళ్ల పాటు పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయురాలిని సర్పంచ్‌తో పాటు, స్థానికులు ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని గాంధీనగరం ప్రాథమిక పాఠశాలలో విజయశ్రీ తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ముంజులూరు పాఠశాలకు బదిలీపై వెళుతున్న ఆమెను సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ దాసరి వెంకటశ్రీనివాస్, పాఠశాల ఛైర్మన్ దుర్గ, స్థానికులు నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

ప్రతిష్ట విగ్రహాలకు గ్రామోత్సవం



గణపేశ్వరం(నాగాయలంక): స్థానిక కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దేవాదాయశాఖ నిధులుతో నిర్మించిన శ్రీ సీతా సమేత రామచంద్రమూర్తి పరివార దేవతల వాయు ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ప్రతిష్ట విగ్రహాలకు శుక్రవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధి, సయ్యాధి వాసములు, మహాశాంతి హోమం జరిపారు. సహస్ర ప్రతిష్ఠాచార్యులు దుర్భా హరిబాబు శాస్త్రి(తెనాలి), దుర్గమ్మ ఆలయ ప్రధానార్చకులు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో పూజాధికములు నిర్వహించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు విగ్రహాలకు వాయు ప్రతిష్ట, అనంతరం పూర్ణాహుతి, శాంతి కల్యాణం, మహా అన్నసం తర్పణ జరుగుతాయని కమిటీ ప్రతినిధి పిరాటి శ్రీనివాసరావు తెలిపారు.

కలంకారీ కళాకారులకు శిక్షణ



గూడూరు: మండల పరిధిలోని కప్పలదొడ్డిలోని కలంకారీ కళాకారులకు నూతన డిజైన్లపై అవగాహన నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పుణ్యవతి కలంకారీ యూనిట్‌లో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత అభివృద్ధి అధికారి బి.రామయ్య, జాతీయ అవార్డు గ్రహీత, ఉడ్ బ్లాక్ డిజైన్‌మేకర్ నర్సయ్య, ట్రైనర్ యక్కల పీతాంబరదరావులు హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్, కలంకారీ కళాకారులకు కొత్త రకాల డిజైన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రోగ్రామ్ మేనేజర్ రామాజంనేయులు, కలంకారీ ప్రొడ్యూసర్స్, కలంకారీ కళాకారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు



నాగాయలంక: మండలంలోని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఇంకా కొనసాగుతుందని.. ఇటీవల కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేశామని తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ వివరించారు. శుక్రవారం ఎంపీపీ భోగాది రాఘవారాణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గం ప్రత్యేక అధికారి పి.సాయిబాబు హాజరై పీఆర్ చేపట్టిన పనులపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమంగా టపాసులు నిల్వ చేస్తే చర్యలు



కోడూరులో దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు



ఫైర్‌సేఫ్టీ వాటర్ పైపులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం

కోడూరు: దీపావళిని పురస్కరించుకొని విక్రయాలు జరిపేందుకు అక్రమంగా టపాసులను నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సౌజన్య కిరణమ్మయి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో శుక్రవారం కోడూరు మండలంలోని పలు దుకాణాల్లో పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాయబజార్ రోడ్డు, ప్రధాన రహదారిలోని పలు ఫ్యాన్సీ, హోల్‌సేల్ షాపులతో పాటు వాటికి సంబంధించిన గోడౌన్లను పరిశీలించారు. షాపుల్లో అక్రమంగా టపాసులు నిల్వ ఉంచి విక్రయాలు జరిపే చట్టపరంగా చర్యలు ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. అనంతరం దుకాణదారులకు నోటీసులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చాణిక్య, ఆర్‌ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక 6వ నంబర్ కాలువ వద్ద గల వినాయక ఏజెన్సీస్ హోల్‌సేల్ టపాసుల దుకాణాన్ని ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం సిబ్బందితో శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణం వద్ద ఇసుక బకెట్ల ఏర్పాటు, వాటర్ స్టోరేజ్ ట్యాంకులు, లైసెన్సులు, ఫైర్ ఎగ్జిటింగ్విషర్లు ఏర్పాటు వంటి రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం షాపు నిర్వాహకుడు గోళ్ల ద్రోణాకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. టపాసుల దుకాణాల వద్ద ముందు జాగ్రత్తగా ప్రమాద నివారణ చర్యలు తప్పక చేపట్టాలని.. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



బాణసంచా విక్రయదారుడికి నోటీసు ఇస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

లైసెన్స్ లేకుండా విక్రయిస్తే ఉపేక్షించం..

పెడన: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు గతేడాది బాణసంచా విక్రయించిన వ్యాపారస్తులను కలిసి వారికి నోటీసులను అందజేశారు. అనంతరం గతేడాది మిగిలిన బాణసంచా వివరాలను ఆరా తీశారు. సీఐతో పాటు పెడన ఎస్‌ఐ జి.సత్యనారాయణ, ట్రైనీ ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి వేతనదారులకు ఈకేవైసీ తప్పనిసరి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కృత్తివెన్ను: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో నూతులపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎఫ్‌ఏలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకంలో నేడు నూతన మార్పులు వచ్చాయన్నారు. వేతనదారులు పనుల్లో పాల్గొనాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీవో సైదారావు, టీఏ కల్యాణ్, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ..

కృత్తివెన్ను: ప్రభుత్వ వసతి గృహాల సౌకర్యాలు, విద్యార్థుల భద్రత తదితర అంశాలను ఎంపీడీవో శ్రీనివాసరావు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తెలుసుకున్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చినగొల్లపాలెం బీసీ బాలురు, ఎస్సీ బాలికల హాస్టల్స్‌ను పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం రికార్డుల నిర్వహణ మొదలైన అంశాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. దీవిలోని హాస్టల్స్ నిర్వహణ బాగానే ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సునీల్, ఆయా హాస్టల్స్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయాలి

బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని సాగు భూములకు రెండో పంట దాళ్వాకు సాగునీరు విడుదల చేయాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. మలిశెట్టి రాంప్రసాదు అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతు సమస్యలపై రైతు సంఘం చేసిన పోరాటాలు, ఉద్యమాలు వివరించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మలిశెట్టి శివరాంప్రసాదు, లంకదాసుల అజయ్‌ఘోష్ 11 మంది రైతులు, సభ్యులను మండల కమిటీగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షులు ఎస్.జనార్దన్‌రావు, తమ్ము శ్రీనివాసరావు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో దగ్ధం



బంటుమిల్లి: స్థానిక బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఆటో అగ్నికి ఆహుతైంది. ఫైర్ ఆఫీసరు జీకే రామోహన్‌రావు వివరాల ప్రకారం.. సాతులూరు గ్రామానికి చెందిన దేవబోయిన ప్రేమరాజు ట్రాలీ ఆటో ద్వారా పలు రకాల గృహోపకరణాలను గ్రామాల్లో విక్రయిస్తూ చిరువ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో స్వగ్రామం తిరుగు ప్రయాణంలో బైపాస్ రోడ్డు వద్ద బ్యాటరీ నుంచి మంటలు ఎగసిపడి ఆటోతో పాటు అందులోని పలు సామాన్లు మంటలకు దగ్ధమైయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు రామోహన్‌రావు తెలిపారు.

మహిళల హక్కుల కోసం పోరాటం



ఐద్వా జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మహిళలు

మచిలీపట్నం టౌన్: మహిళా ఉద్యోగ, కార్మికులతో నైట్ షిఫ్టుల ద్వారా పని చేయించే విధంగా కూటమి ప్రభుత్వం జీవో తీసుకురావడాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పోలన రజిని తీవ్రంగా ఖండించారు. ఐద్వా కృష్ణాజిల్లా ఏడో మహాసభను స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా టౌన్ సహాయ కార్యదర్శి పరస లక్ష్మి, టౌన్ కమిటీ అధ్యక్షురాలు రువోలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొడాలి సుజాత, కమిటీ సభ్యులు బూర భవాని, మత్రపు పద్మావతి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు చుక్కాకుల బుల్లెమ్మ, ఉపాధ్యక్షురాలు శీరంశెట్టి విజయ, అంగన్‌వాడీ జిల్లా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అంగత రమదేవి, ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలు కడవకోల్లు లక్ష్మి, ప్రాజెక్టు కార్యదర్శి చోరగుడి నాంచారమ్మ, కోశాధికారి తోట సుజాత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఘంటసాల: ఘంటసాల మండలం శ్రీకాకుళం, కొడాలి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల మండల విద్యుత్ శాఖ ఏఈ పి.రవి కుమార్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం, కొడాలి 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శ్రీకాకుళం, సూరపనేనిపాలెం, వీరమాచినేనిపాలెం, అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి, చిట్టూర్పు, కొడాలి, తాడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోడూరు: కోడూరు మండల వ్యాపంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ గోపిచంద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మచిలీపట్నం టౌన్: నగరంలో శనివారం ఉదయం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బలరామునిపేట, నిజాంపేట, జిల్లా కోర్టు వెనుక ప్రాంతం, శక్తి గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఇనకుదురుపేట, కబేళా రోడ్, జెండా సెంటర్, జైహింద్ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలలకు చేరిన పుస్తకాలు



బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెకండ్ సెమ్ పుస్తకాలు 100 శాతం చేరుకున్నాయని ఎంఈవోలు ముబీన్‌భాను, వెంకటేశ్వరరావులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 2,796 మంది విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలను శుక్రవారం అందజేశామన్నారు. 2025 నవంబరు నుంచి సెకండ్ సెమ్ మొదలవుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారి అక్రమాలపై విజిలెన్స్ విచారణ



విజిలెన్స్ అధికారికి స్టేట్‌మెంట్ ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలోని దేవరపల్లిలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై తోట్లవల్లూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీరు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి విచారణకు ఆదేశించినట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర కో–కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భవాని పర్యవేక్షణలో ఉయ్యూరులో విచారణ జరుగుతుందని తెలిపారు. విచారణలో భాగంగా విజిలెన్స్ ఎస్‌ఐ హారికా జెస్సీని కలిసి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరామని పేర్కొన్నారు.

బ్యాంకు రుణాలు తప్పక చెల్లించాలి

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీ లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రతిఒక్కరూ లోన్ తిరిగి చెల్లించాల్సిందేనని యూనియన్ బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం బ్యాంక్ అధికారులు టిడ్కో కాలనీలో పలువురు లబ్ధిదారులకు నోటీసులు అందించారు. అధికారులు మాట్లాడుతూ.. కొందరు లబ్ధిదారులు రాజకీయ హామీలు నమ్మి అపోహలకు గురవుతున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బ్యాంకు నెలసరి వాయిదాలు చెల్లించాల్సిందేనన్నారు. ప్రభుత్వం, టిడ్కో ఇప్పటికే స్పష్టంగా రుణాలు చెల్లింపులపై ప్రకటన జారీ చేసిందన్నారు. ఇల్లు కేటాయించిన అనంతరం లబ్ధిదారులకు ఏ విధమైన ఆర్థిక సాయం, రుణమాఫీ ఉండదని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుడు విధిగా రుణాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటి రీజినల్ ఆఫీసర్ రామలింగారెడ్డి, రికవరి చీఫ్ మేనేజర్ రాకేష్, గుడివాడ బ్రాంచ్ మేనేజర్ త్రివేణి, సిబ్బంది, టిడ్కో ప్రతినిధి ఆనందరావు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత



పోస్టల్ బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్ ఎస్పీ శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా కస్టమర్ కేర్ దినోత్సవాన్ని పోస్టల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో ఆయన వినియోగదారుల సమస్యల పరిష్కారం, సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. తపాలా వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాలను అధికారులకు సూచించారు. పోస్ట్ ఆఫీస్ సేవలను విస్తృత పరుస్తున్నామన్నారు. అనంతరం పెంజంద్ర గ్రామానికి చెందిన పెద్దిపోయిన శారద తపాలా జీవిత బీమా మొత్తం రూ.3,12,521లను నామిని అయిన ఆమె భర్త పెద్దిపోయిన ఏడుకొండలకు చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘కోటి సంతకాల సేకరణ’ పోస్టర్ ఆవిష్కరణ



పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను పార్టీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి)తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్లు ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలకుర్తి రమేష్, బూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షులు మద్ది చిన్న, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాలభాస్కర్(బాలు), అవనిగడ్డ మండల పార్టీ ఉపాధ్యక్షులు గార్లపాటి గోపి, నాయకులు గరికిపాటి కృష్ణారావు, కొండవీటి నాగరాజు, గరికిపాటి ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోళ్ల పెరుగుదలతో ఆర్థిక వ్యవస్థ మెరుగు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: కొనుగోళ్లు పెరిగి ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగవుతోందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ప్రార్థన మందిరంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వన్ నేషన్, వన్ జీఎస్టీ ఉండాలనే లక్ష్యంతో గతంలో ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబులను కేవలం రెండు స్లాబులుగానే చేశారని అన్నారు. ప్రతి ఇంటికి జీఎస్టీ తగ్గింపు కరపత్రం అందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల అధికారిణి ఎ.రంగామణి, టీడీపీ నాయకులు హాన్ను, శ్యామలయ్య, శీరం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులకు మడ అడవులు రక్షణ



మొక్కలు నాటుతున్న ఫౌండేషన్ అధికారులు

కృత్తివెన్ను: తీరప్రాంత పరిరక్షణతో పాటు, తీరాన్ని సముద్రపు కోత నుంచి రక్షించడంలో మడ అడవుల ప్రాముఖ్యత ఎంతో ఉందని అవంతీ ఫీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. శుక్రవారం చినగొల్లపాలెం గ్రామంలో అవంతీ ఫౌండేషన్, ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో తీరం వెంబడి మడ, సరుగుడు, తాటిచెట్లను నాటారు. వీటిని సంరక్షన వల్ల కోత నివారణ చేయనున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తులు, తుఫానుల సమయంలో ఆస్తి, ప్రాణనష్టం లేకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ అధికారి ఆర్.సుబ్రహ్మణ్యం, జీఎం ఎస్.మహంతి, ప్రాజెక్ట్ మేనేజర్ రంగారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

మచిలీపట్నం అర్బన్: అత్యవసర సేవలు, విపత్తుల సమయంలో మానసిక ఆరోగ్య సేవలు అత్యంత అవసరమని అసాంక్రమిత వ్యాధుల ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హిమబిందు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో టెలి-మానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించాలని.. 24 గంటలూ ఉచిత మానసిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల అక్రమ మంజూరుకు సహకరించినవారిపై కేసు

గుడివాడ రూరల్: పట్టణంలో స్వయం సహాయక సంఘాల పేరుతో రుణం తీసుకున్న వారికే మళ్లీ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించిన వ్యవహారంపై మెప్మా ఆర్పీలు, సీసీలు, బ్యాంక్ సిబ్బందిపై విజయవాడకు చెందిన బ్యాంకుల పరిశోధన విభాగం అధికారులు గుడివాడ టూటౌన్ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. గుడివాడ పట్టణంలో సుమారు 660 మంది స్వయం సహాయక సంఘాలకు తోడు నకిలీ గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు రూ.5.77 కోట్ల రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఓ డ్వాక్రా సంఘంలో ఉన్న సభ్యులు ఒకే గ్రూప్‌లో సభ్యురాలిగా ఉండాలని తెలిపారు. గుడివాడలోని ఆర్పీలు పిల్లా శిరీష మరో 10 మంది, మెప్మా సీసీలు రాజేంద్ర, సుజాత అనే వ్యక్తులు ఒకే గ్రూపులో ఉన్నట్లు పలు రకాల ధ్రువపత్రాలు ఇచ్చారు. దీంతో బ్యాంక్ అధికారులు వీరికి వేరే బ్యాంకులో రుణం ఉన్నా మళ్లీ రుణం మంజూరుకు సహకరించారన్నారు. వీటిని గుర్తించిన బ్యాంకు పరిశోధన అధికారులు తమకు ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వీరు తీసుకున్న రుణాల్లో రూ.3 కోట్లకు పైగా రుణం చెల్లించారని పేర్కొన్నారు. ఇంకా వడ్డీతో సహా రూ.3.50కోట్ల వరకూ చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. బ్యాంక్ అధికారులకు కొందరు ఫిర్యాదు చేయగా బ్యాంకు పరిశోధన విభాగం విచారణ చేసి తమకు ఫిర్యాదు చేసిందని టూటౌన్ సీఐ కె.హనీష్ తెలిపారు. ఈ మేరకు ఆర్పీలు, మెప్మా, బ్యాంక్ సిబ్బందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

కూచిపూడి(మొవ్వ): కృష్ణాజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మచిలీపట్నం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గురువారం అర్ధరాత్రి వరకూ నిర్వహించిన తనిఖీల్లో వేలాది రూపాయల విలువ గల బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కూచిపూడి ఎస్‌ఐ ఎన్.విశ్వనాథ్ కథనం మేరకు.. మచిలీపట్నం స్పెషల్ పార్టీ ఆర్‌ఎస్‌ఐ చందనకిరణ్ తమ సిబ్బంది ఏసుబాబు, గౌరీ నాయుడు, నాగలక్ష్మి, పెదపూడి వీఆర్‌వో కేబీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి పెదపూడి గ్రామ పరిధిలో పెదసనగల్లు రోడ్డులోని కటకం పూర్ణ చంద్రరావు(చిట్టి) షాప్‌లో లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ చేసిన సుమారుగా రూ.60 వేల విలువ గల దీపావళి బాణసంచా సామగ్రిని మధ్య వర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

పామర్రు: ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కె.జాన్ మోదీ ఆరోపించారు. స్థానిక ఎమ్మార్పీ భవనం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల మంది విద్యాశాఖకు అనుబంధంగా సమగ్ర శిక్షా ద్వారా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమగ్ర శిక్షా, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, ఎంటీఎస్ అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఏర్పడి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబరు 12వ తేదీన దశాబ్ద ఐక్య భవిష్యత్తు పోరాట సభను విజయవాడ ఎంబీకే విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.